

# నాలుగుపాదాల ధర్మాసుపత్రి

## సి.వి.రమణ

దేశంలో చాలా ధర్మాసుపత్రులున్నాయి.

వాటిలో ధర్మం మందులూ వుండువు కాని, డాక్టర్లూ, నర్సులూ-రోగులూ వుంటారు.

రోగులు వాళ్ళ మానాన వాళ్లుంటే

కొందరు డాక్టర్లు నర్సుల మానాన వుంటారు.

పురుళ్ళ వార్డులో పచ్చి బాలెంతలూ-పసి కందులెత్తుకుపోవడానికి కుక్కలూ,

అర్జంటు వార్డులో చావ సిద్ధంగా వున్న వాళ్ళూ వాళ్ళ ప్రాణాలు తోడెయ్యడానికి తోటి వాళ్ళూ—

గోడల మీద బల్లులూ-బొల్చీ తన్నేసిన నాయకులూ-ఇవీ ఆ ఆసుపత్రి అలంకారాలు.

ఇంకా—


పక్కబెడ్‌లో రోగి ఆఖరిక్షణాల్లో చావు మూలుగు-మూలుగుతున్నా ఇవతల బెడ్‌లో మేల్ నర్స్‌తో రొమాన్స్ చేసే కరేజీగల నర్సు మీనాక్షి వుంది.

ఆవులిస్తే పేగులెక్కెట్టి-రవిక విప్పేస్తే మనసు లెక్కెట్టి-కోక విప్పేస్తే గుణం లెక్కెట్టగల డాక్టరు శివస్వామి వున్నాడు—అతనిచేత రోజూ గుణాన్నీ మనసునీ లెక్కెట్టించుకునేందుకు ప్రౌఢనర్సు రమామణి వుంది.

రమామణిని తల్లిగా గౌరవించుకుంటూ—రోజుకో తండ్రిని వెతికి తెచ్చే కాంపౌండర్ రామ్మూర్తి వున్నాడు.

'కోమా'లో ఆసుపత్రికొచ్చిన వాళ్ళకూడా తన సొగసుతో సుఖవ్యాధులు సంక్రమింప చేయగల కుర్రనర్సు 'కుమారి' వుంది.

ఇవీ అక్కడి మనుషుల శక్తిసామర్థ్యాలు.




ఇంకా—

మొగుణ్ణి కూడా ప్రియుడిలాగే చూసుకుంటుంది మీనాక్షి-కనక పతివ్రత.

ప్రియుణ్ణి కూడా మొగుడికంటే ఎక్కువగా చూసుకుంటుంది రమామణి కనక మహా పతివ్రత.

మొగుడి ట్రీట్‌మెంట్ మొగుడికీ, ప్రియుడి ట్రీట్‌మెంట్ ప్రియుడికీ పంచియిచ్చే కుమారి కుర్రపతివ్రత.

డాక్టర్ శివస్వామి పుత్రకామేష్టినాటి దశరధ మహారాజులావుంటే కాంపౌండర్ రామ్మూర్తి సీతాస్వయంవరం నాటి జనక భూపతిలా వుంటాడు—

ఇలా కాలం-తెలుగు చలన హిట్ చిత్ర రాజం-సినిమాస్కోప్ ఈస్ట్‌మన్ రంగుల్లో సిల్వర్‌జూబ్లీకి ఉరకలు వేస్తున్నట్టు పరుగెత్తుతోంది.

మంచివాళ్ళను చూస్తే దేవుడికైనా కన్నెర్రే కదా!

ఒకానొక శుభదినాన కుర్రది కుమారీ-శివస్వామీ కన్సల్టింగ్ రూమ్‌లో వొంటిమీద స్పృహా-గుడ్డలూ-రెండూ లేకుండా శృంగార క్రీడల్లో-క్లయిమాక్స్‌లో వుండగా ప్రౌఢమీనాక్షి తలుపు కంతలోంచి చూడ్డంతో హాస్పటల్ కలరాపేషంట్ కడుపులా అల్లకల్లోలమైపోయింది.

ఆకల్లోలంలో కొనవూపిరితోవున్న నలుగురు పేషంట్లలో ముగ్గురు ఈ అశాంతితో హరీమన్నారు.

కాంపౌండర్ రామ్మూర్తిని అడ్డం పెట్టుకుని చచ్చిచెడీ గొప్ప డిప్లమసీ, స్ట్రేటజీ ప్లే చేసి, శివస్వామి మీనాక్షినీ-కుమారిని యిన్‌స్టాల్‌మెంట్ బేసిస్‌లో ఏలుకోడానికి ఒడంబడిక చేసుకున్న వేళ-నాలుగో బెడ్ పేషంట్—

కారుకింద పడబోయిన ఓ ముసిల్దాన్ని రక్షించి, ప్రతిఫలంగా పక్కటెముకలు విరుచుకున్నవాడు, బోలెడు రక్తం పోయినా వొంట్లో మిగిలిన రక్తంలో వేడి మిగుల్చుకున్న వాడూ ధర్మాసుపత్రిలో ధర్మాన్ని భరించలేక ఎప్పుడీ నరకంలోంచి బయట పడదామా అని బాధతో ఏడుస్తున్నవేళ—

ఓ పూర్ణగర్భిణిని స్పృహలేని స్థితిలో నలుగురాడాళ్లు మోసుకొచ్చారు.

ఆమె ముఖం భయంకరమైన తుఫాన్‌ని మోస్తున్న నిండుమేఘంలా గంభీరంగా వుంది.

ఆమె చేతులు మంచు బిందువును మోయ

లేని అలసత్వంతో వాణికిపోయే లేత తమల పాకుల్లా సున్నితంగా నీరసంగా వున్నాయి.

ఆమె పెదాలు వెలిసిపోయిన కెంపుగులాబీ రేకుల్లా బాధాకరంగా వున్నాయి.

మూసుకున్న ఆమె కళ్ళు యుద్ధభూమిలో వీరమరణం చెందిన భర్తను-స్వహస్తాలతో చితిని పేర్చి-అగ్ని రగిల్చిన దానిలా ధైర్యంగా వున్నాయి.

వెంట వచ్చిన ఆ నలుగురు ఆడాళ్ళూ డాక్టర్ గారికి దండాలెట్టి 'నొప్పులొచ్చి స్పృహ పోయింది-ఎలాగైనా బతికించమని బతిమా లారు' ఆ ఆస్పత్రిలోకి ప్రాణాలతో అడుగెట్టి మళ్ళీ వాటిని పుచ్చుకుని తిరిగిపోయిన వాళ్ళు చాలా తక్కువన్న సంగతి తెలియక—

ఆ సంగతి బాగా తెలిసున్న కాంపౌండర్ రామ్మూర్తి నిత్యహాయిబాబాలా నవ్వాడు. 'పేషంట్ కేం ఫర్వాలేదు-పైగా పురుడొయ్యే డానికి మనుషుల్లేరు తీసుకుపోండి' అన్నాడు.

వాళ్ళు 'డాక్టరు బాబుని పిలవండి' అంటూ శోకన్నాలు ప్రారంభించారు.

డాక్టరుబాబు గదిలో మీనాక్షి జాకెట్ నూ అంతరాత్మను చిలక్కొయ్యకి వేళ్ళాడదీసి, చీరనూ,శీలాన్నీ స్టూలుమీదకి గిరవాటెట్టి డాక్టరు గారికి అద్వాన్నుగా ముద్దొకటి యివ్వబోతుం డగా—'డాక్ట్రుబాబూ' అంటూ వాళ్ళు ఎడ్చే ఏడుపులతో తలుపులు కూడా బద్దలైపోతా యేమోనన్న భయంతో శివస్వామి సభ్యతా యుతంగా దుస్తులు ధరించి మరీ వచ్చాడు.

పరాయిస్త్రీ అయిన రోగిని మునివేళ్ళ నాడి పరీక్షచేసి-మరేం ఫర్వాలేదు-కొంపకి తీసుకు పొమ్మన్నాడు. అప్పటికే ఆ గర్భిణీ స్త్రీ శ్వాస చాలా భారంగా పీలుస్తోంది. చూసేసరికి ఈ క్షణంలోనో-మరో క్షణంలోనో ఆమె చచ్చి పోతుంది-డాక్టరేమైనా చెయ్యకపోతే అన్నది తెలిసిపోతోంది.

కూడా వచ్చిన వాళ్ళలో ఒకామె కొంచెం వయసు మళ్ళినది 'సచ్చిపోద్ది డాక్ట్రుబాబు— సూది మందిప్పించు' అని పెద్దగొంతుతో ఏడిచింది.

'న్యూసెన్స్-సూది మందూలేదు - దారం మందూ లేదు. గెటవుట్ డర్టీబీస్ట్స్' అన్నాడు శివస్వామి.

తోటీవాళ్ళు వాళ్ళని బయటకు తోసే స్తున్నారు.

ధర్మాసుపత్రులు కష్టజీవులకు కాదని తెలి యక పొరబాటున ఆ గర్భిణీస్త్రీ తాలూకు వాళ్లు ఆమెను మోసుకుంటూ బయటకి నడిచారు.

"డాక్టరుగారూ" లోపల్నించి మీనాక్షి పిలిచింది.

"కమింగ్" అంటూ శివస్వామి లోపలికి పరిగెత్తాడు. ధర్మాసుపత్రి నరకద్వారాలు దాటిన ఆ గర్భిణీ స్త్రీ భూనభోంతరాళాలు దద్దరిల్లేలా ఓ కేకపెట్టింది.

నాలుగో బెడ్ పేషంట్ ఒక్క దూకులో కిటికీ దగ్గరకు వెళ్ళి బయట దృశ్యాన్ని చూసి కళ్ళు తిరిగి గోడకు చేరగిలపడిపోయాడు.

ఓ ధర్మాత్ముౡరాలైన ముష్టిది-తన చిరుగు దుప్పటి వీధికి అడ్డంగా పట్టుకుంది.

నెత్తుటి మడుగులో-మందారపువ్వులా వున్న ఓ నిర్జీవ శిశువు మరణించి పుట్టి-పుట్టుకతోనే మరణాన్ని పొందగలిగినందుకు నవ్వు కుంటోంది.

చనుపాలతో చంటిదాన్ని పెంచి-గోరుముద్ద లతో గొప్పదాన్ని చేయవలసిన బాధ్యతనుంచి ఆ తల్లి సుదూర తీరాలకు పయనమైపోయింది.

ఆ ధర్మాసుపత్రి, ప్రసవంలో చనిపోయిన పెళ్ళాంపేర కట్టించి తను శిలా విగ్రహ రూపంలో ఆస్పత్రి కాంపౌండ్ లో వెలసిన ధర్మదాత నవ్వుకున్నాడు.

ఆసుపత్రి ఎదురుగావున్న ఓ టోపీ రాజ కీయ నాయకుడి సిమ్మెంట్ బొమ్మమీద ఓ కాకి రెట్టవేసి ఎగిరిపోయింది.

'ఆ డాక్ట్రు పెళ్ళాం ఎప్పుడిలా సస్తదో' అని కూడా వచ్చినవాళ్లు ఏడుస్తున్నారు.

లోపల మీనాక్షీ శివస్వామీ నవ్వుకుంటు న్నారు. కాంపౌండరూ-రమామణీ నవ్వుకుంటు న్నారు. నాలుగు కాళ్ళతోటీ పశుధర్మం-ధర్మాసు పత్రిలో నడుస్తోంది. □